# జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలి

● జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.రాజగోపాల్



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.రాజగోపాల్

సూర్యాపేట లీగల్, డిసెంబర్ 12 : ఈ నెల 30న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.రాజగోపాల్ పిలుపునిచ్చారు. మంగళవారం జిల్లా కోర్టులో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి పి.శ్రీవాణి ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి అమరావతి, సూర్యాపేట ప్రధాన అదనపు జూనియర్ సివిల్ జడ్జి కె.సురేశ్, జె.ప్రశాంతి, సూర్యాపేట అడిషనల్ ఎస్పీ నాగేశ్వర్‌రావు, ఎక్సైజ్ ఎస్పీ నాగేశ్వర్‌రావు, ఎక్సైజ్ ఎస్పీ అనిల్, ఏపీపీ హేమలత, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

# సిలబస్‌ను త్వరగా పూర్తి చేయాలి : డీఈఓ అశోక్



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈఓ అశోక్

నడిగూడెం, డిసెంబర్ 12 : పదో తరగతి సిలబస్ త్వరగా పూర్తి చేసి పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధం చేయాలని డీఈఓ అశోక్ ఉపాధ్యాయులకు సూచించారు. మంగళవారం ఆయన మండల కేంద్రంలోని జడ్పీహెచ్‌ఎస్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు అర్థమయ్యేలా పాఠ్యాంశాలు బోధించాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు పాఠాలను బోధించడంతో పాటు, ప్రశ్నలు వేసి జవాబులను రాబట్టారు. ఆయన వెంట హెచ్‌ఎం. శోభన్‌బాబు, ఉపాధ్యాయులు ఉన్నారు.



మోత్కూరులో సబ్ రిజిస్ట్రార్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఉప సర్పంచ్ కృష్ణ, గ్రామస్తులు

# పంచాయతీ అనుమతి లేకుండా రిజిస్ట్రేషన్ చేయొద్దు

● సబ్ రిజిస్ట్రార్‌కు మోత్కూరు ఉప సర్పంచ్ వినతి

మోత్కూరు, డిసెంబర్ 12 : మండలంలోని పాటిమట్ల క్రాస్‌రోడ్డులో ఇండ్ల ప్లాట్లకు గ్రామ పంచాయతీ అనుమతి లేకుండా రిజిస్ట్రేషన్ చేయొద్దని ఆ గ్రామ ఉప సర్పంచ్ కొత్తోజు కృష్ణ, కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి రాచకొండ బాలరాజుగౌడ్ మోత్కూరు సబ్ రిజిస్ట్రార్‌కు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పంచాయతీ అనుమతి లేకుండానే అక్కడ కొందరు ఇండ్ల నిర్మాణాలను చేపట్టి పన్నులను చెల్లించడం లేదని తెలిపారు. అక్రమ నిర్మాణదారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షుడు చిరుమర్తి యాదయ్య, బట్టు మొగులయ్య పాల్గొన్నారు.

# ఎమ్మార్పీఎస్ ధర్నాను విజయవంతం చేయాలి

● ఆ సంఘం సూర్యాపేట నియోజక వర్గ ఇన్‌చార్జి పరశురాములు



ఉపేందర్‌కు నియామక పత్రం అందజేస్తున్న ఎమ్మార్పీఎస్ టీఎస్ నియోజక వర్గ ఇన్‌చార్జి పరశురాములు

బొడ్రాయిబజార్, డిసెంబర్ 12 : ఎస్సీ వర్గీకరణ చేపట్టాలని డిమాండ్ చేస్తూ ఎమ్మార్పీఎస్ టీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్‌మాదిగ ఆధ్వర్యంలో ఈ నెల 19న ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ టీఎస్ సూర్యాపేట నియోజక వర్గ ఇన్‌చార్జి పాలడుగు పరశురాములు పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక పబ్లిక్ క్లబ్ ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో వర్గీకరణ చేస్తామని బీజేపీ హామీ ఇచ్చి పదేండ్లు గడిచినా ఇంకా వర్గీకరణ చేయకుండా మాదిగలను మోసం చేస్తుందన్నారు. అనంతరం ఎమ్మార్పీఎస్ టీఎస్ పట్టణ ఉపాధ్యక్షుడిగా ధైద ఉపేందర్, కార్యదర్శిగా పిడమర్తి కమల్ మాదిగను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు దుబ్బ రమేశ్, ఇరుగు నాగరాజు, కుర్ర నాగయ్య, ఈద కిరణ్, తంతెనపల్లి రాజు, బొజ్జ రాజు, దగ్గుబాటి వెంకన్న, దుబ్బ ప్రవీణ్, పాల్వాయి రాకేశ్, దున్న దయాకర్, దుబ్బ శ్యామ్, సామేల్‌మాదిగ పాల్గొన్నారు.

# అధికారం ఉన్నా..లేకున్నా జనం మధ్యే ఉంటా

- ప్రజల నుంచి ప్రశ్న వచ్చే వరకు ఓపికతో ఉందాం
- ఇచ్చిన హామీలను నెరవేర్చిన చరిత్ర కాంగ్రెస్‌లో లేదు
- ఆ పార్టీ చిల్లర వేషాలు నల్లగొండలోనే అధికంగా ఉంటాయి
- అసెంబ్లీకి పోకున్నా ఏదో చేస్తానని ఆ పార్టీ నాయకుడు అంటున్నాడు
- విద్యుత్‌పై అసెంబ్లీలో చర్చ పెట్టి ఉన్నది ఉన్నట్లు చెప్పేందుకు సిద్ధం
- బీఆర్‌ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి



సమావేశానికి హాజరైన నాయకులు, కార్యకర్తలు

బొడ్రాయిబజార్, డిసెంబర్ 12 : హామీలను నెరవేర్చిన ఘనత కాంగ్రెస్ పార్టీ చరిత్రలోనే లేదని రాష్ట్ర విద్యుత్ శాఖ మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. మంగళవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని సుమంగళి ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన బీఆర్‌ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికారం ఉన్నా లేకున్నా ఎప్పుడూ ఒకేలా ఉంటూ ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు ముందుంటామని తెలిపారు. ప్రజలు మనకు ప్రతిపక్ష బాధ్యతను ఇచ్చారని వారి ఆలోచనలతో నిర్ణయాలు తీసుకుని ముందుకు సాగుదామని చెప్పారు. ప్రజలు ప్రభుత్వంపై ప్రశ్నలు లేవనెత్తేంత వరకు ఓపికతో ఉందామని సూచించారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలయ్యేంత వరకు ప్రజల పక్షాన నిలిచి పోరాడుదామని తెలిపారు. ప్రజలు బీఆర్‌ఎస్‌కు పదేండ్లు అధికారం ఇస్తే ఎన్నో మంచి పనులు చేసినట్లు వెల్లడించారు. ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలంటే దమ్ము ధైర్యం ఉండాలని కాంగ్రెస్ 90 రోజులు కాదు కదా 900 రోజులైనా నెరవేర్చదన్నారు. జోగులాంబ నుంచి అలంపూర్ వరకు బీఆర్‌ఎస్ అభ్యర్థులందరూ ఓటమి పాలైనా సూర్యాపేటలో తాను గెలిచి బొడ్రాయిలాగా నిలిచానని మళ్లా ఎన్నికల వరకు ఒక్కటి లేకుండా అన్ని మనమే గెలుస్తామని అందులో ఎలాంటి సందేహం లేదని భరోసానిచ్చారు. మంచి కోసం నిలబడి త్యాగాలకు సిద్ధపడిన చరిత్ర సూర్యాపేట ప్రజలదని అందుకు తన గెలుపే నిదర్శనమన్నారు. బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు గ్రామాల్లో జరిగిన లోటుపాట్లను ఆలోచించి తిరిగి పునరావృతం కాకుండా చూసుకోవాలన్నారు. కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణను కేసీఆర్ తన ఆలోచనలతో దేశంలో నంబర్ వన్‌గా తీర్చిదిద్దినట్లు తెలిపారు. కేసీఆర్‌కు ఉన్న విజన్, ఆలోచన ఇవాళ అధికారంలోకి వచ్చిన ఏ ఒక్కరికి లేదన్నారు. కాంగ్రెస్ డిసెంబర్ 9న రైతు బంధు ఇస్తామని చెప్పి ఇవ్వలేదని.. తాము ఇస్తామంటే ఈసీకి ఫిర్యాదు చేసిందన్నారు. రుణమాఫీ చేస్తామని చేయలేదని, రైతుల ధాన్యాన్ని క్వింటాకు బోనస్ చెల్లించి రూ.4,500కు కొనుగోలు చేస్తామని నేటి వరకు ఆ దిశగా ఎలాంటి ఆలోచన చేయలేదని దుయ్యబట్టారు. రైతులకు 24 గంటల కరెంట్ ఇవ్వలేక సాకులు చెప్పి తప్పించుకునేందుకు విద్యుత్ శాఖలో అప్పులు చేశారని సాకు చూపెడుతుందని చెపపారు. ఈ విషయంపై అసెంబ్లీలో తనను అడిగితే సమాధానం చెప్పేవాడినన్నారు. నాడు 6 వేల మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి అయితే నేడు 18 వేల మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతుందని, నాడు జెన్‌కో ఆస్తులు రూ.18 వేల కోట్లు అయితే నేడు రూ.50 వేల కోట్లకు వచ్చాయని, నాడు ఇచ్చింది 6 గంటల కరెంట్ అయితే తాము ఇచ్చింది 24 గంటల కరెంట్ అని తెలిపారు. అసెంబ్లీలో వాళ్లు చర్చ పెట్టడం కాదు తానే చర్చ పెట్టి ఉన్నది ఉన్నట్లు చెబుతానన్నారు. ఉద్యమం నడిపినవారమంతా అసెంబ్లీలో ఉన్నామని మాట్లాడుతామన్నారు. అధికారం ఎక్కువ రోజులు ఏం ఉండదని అవకాశాలు వాళ్లే ఇస్తారని మనం సిద్ధంగా ఉండాలన్నారు. అధికారం మారిందని కాబట్టి చిల్లర వేశాలు ఉంటాయని. ఇవి ముఖ్యంగా నల్లగొండ జిల్లాలో ఉంటాయని తెలిపారు. కేసీఆర్ కొట్లాటలు, గొడవలు ఉండొద్దని అవి అభివృద్ధికి ఆటంకమని పదేండ్లుగా ప్రశాంతంగా ఉంచిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. మనలాగా చేయడం ఎవరితోను కాదని అది అందరికీ తెలుసన్నారు. ఎన్నికల ముందు తాను చెప్పినట్లుగానే వృద్ధ సింహం గాండ్రిస్తున్నదని అసెంబ్లీకి పోకున్నా అన్ని చేస్తామంటున్నాడు. ఎలా చేస్తాడు? ఏం చేస్తాడని ప్రశ్నించారు. సూర్యాపేట ప్రధాన రహదారిపై రోడ్డు ప్రమాదాలు జరుగుతాయని ఆలోచనతో డివైడర్‌ను కట్టించామని ఇప్పుడు ఆ డివైడర్‌ను తొలగించి రోడ్డు ప్రమాదాలకు కారకులు కాబోతున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ నాయకులు చిల్లర చేష్టలతో ప్రజలను మెప్పించలేరన్నారు. రెండు మూడు రోజులుగా జరుగుతున్న సంఘటనలతో ఇక్కడ తాను గెలిచిన కాబట్టి నాకు ఓటు వేయని వాళ్లు కూడా ఇప్పుడు ధైర్యంగా ఉన్నట్లు చెప్పారు. అధికారంలో ఉన్న వారి వైపు అధికారులు ఉంటారని అందులో ఎలాంటి సందేహం లేదన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలపై వారంలో స్పష్టత వస్తుందని దానిపై తిరిగి ఆలోచన చేద్దామని, పార్టీ ఏ పిలుపు ఇచ్చినా వెంటనే స్పందించడమే మన ప్రధాన బాధ్యతన్నారు. అధికారంలో ఉన్నా లేకున్నా ప్రజల తరుపున పోరాడడమే మన ప్రధాన కర్తవ్యమని దాన్ని నాయకులు, కార్యకర్తలు దృష్టిలో ఉంచుకుని చైతన్యవంతులై పని చేయాలని పిలుపునిచ్చారు. బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ ఆరోగ్యం కుదుటపడిందని నాయకులు, కార్యకర్తలు ఎలాంటి కలత చెందవద్దని త్వరలోనే ప్రజల్లోకి వస్తారని తెలిపారు. సమావేశంలో ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు, బీఆర్‌ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై.వెంకటేశ్వర్లు, జడ్పీ వైస్ చైర్మన్ గోపగాని వెంకటనారాయణ గౌడ్, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.



కరపత్రం ఆవిష్కరిస్తున్న విద్యార్థి సంఘం నాయకులు

# కుల వ్యవస్థ నిర్మూలనే లక్ష్యంగా ముందుకు

● పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు నాగరాజు

సూర్యాపేట అర్బన్, డిసెంబర్ 12 : కుల వ్యవస్థ నిర్మూలనే లక్ష్యంగా ముందుకు సాగాలని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు ఆవుల నాగరాజు అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఈ నెల 30న నిర్వహించే స్ఫూర్తి సభల కరపత్రాలను ఆవిష్కరించి మాట్లాడారు. కుల వ్యవస్థను కూల్చకుండా ప్రజాస్వామ్యం సాధ్యం కాదని సూచించిన వ్యక్తి అంబేద్కర్ అన్నారు. కార్యక్రమంలో మరికంటి హరీశ్, అంజద్, అశోక్, ఎడ్ల మహేశ్, ఎల్లన్న, కార్తీక్, వినయ్, సురేందర్, రవీందర్, అఖిల్ పాల్గొన్నారు.

# నేడు వల్లాపురంలో చిరుధాన్యాలపై అవగాహన

నడిగూడెం, డిసెంబర్ 12 : సిరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండలంలోని వల్లాపురం గ్రామంలో చిరుధాన్యాల సాగు, వాటి ప్రాముఖ్యంపై బుధవారం అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు ఆ సంస్థ చైర్మన్ మొలుగూరి గోపి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ప్రత్యేక చిరుధాన్యాలు, చిరుధాన్య ఉత్పత్తుల ప్రదర్శన నిర్వహించనున్నట్లు తెలిపారు. చిరుధాన్యాల వల్ల ఉపయోగాలపై అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రైతులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

# జాతీయ మానవ హక్కుల సంస్థ జిల్లా అధ్యక్షుడిగా అశోక్



జాతీయ మానవ హక్కుల సంస్థ జిల్లా అధ్యక్షుడిగా నియామక పత్రం అందుకుంటున్న అశోక్

సూర్యాపేట రూరల్, డిసెంబర్ 12 : జాతీయ మానవ హక్కుల సంస్థ సూర్యాపేట జిల్లా అధ్యక్షుడిగా మండల పరిధిలోని ఎండ్లపల్లి గ్రామానికి చెందిన ఉయ్యాల అశోక్ మంగళవారం నియమితులయ్యారు. హైదరాబాద్‌లో నిర్వహించిన జాతీయ మానవ హక్కుల దినోత్సవంలో భాగంగా జాతీయ మానవ హక్కుల సంస్థ చైర్మన్ డాక్టర్ ఎండీ యాసిన్, రాష్ట్ర అధ్యక్షుడు బద్దిపడిగ శ్రీనివాస్‌రెడ్డి చేతుల మీదుగా అశోక్ నియామక పత్రం అందుకున్నాడు. కార్యక్రమంలో జాతీయ మానవ హక్కుల సంస్థ నాయకులు పాల్గొన్నారు.